గుడిపేట బెటాలియన్‌ను సందర్శించిన ఏడీజీపీ

మొక్క నాటుతున్న ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్

హాజీపూర్, సెప్టెంబర్ 27 : గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌ను బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. బెటాలియన్‌లోని పలు విభాగాలను సందర్శించి, అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ముందుగా ఆయనకు సంజయ్ రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, సీఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు, ఆర్ఐ నాగేశ్వర్ రావ్, కాళిదాసు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊర చెరువు హద్దులపై సర్వే ప్రారంభం

మందమర్రి, సెప్టెంబర్ 27 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి ఊర చెరువు హద్దులపై సాగునీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు శుక్రవారం ఉమ్మడి సమగ్ర సర్వే ప్రారంభించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు చెరువు పరిసరాలను పరిశీలించారు. ఉదయం ప్రారంభమైన సర్వే సాయంత్రం వరకు కొనసాగింది. సాగునీటి పారుదల శాఖ ఏఈ రమ్య మాట్లాడుతూ చెరువు శిఖం పరిధిలో ఉన్న భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దుల కొలతల పనులు చేపట్టామన్నారు. సర్వే పూర్తయిన తర్వాత రికార్డులను రెవెన్యూ అధికారులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ ఆర్ఐ గణపతి రాథోడ్ మాట్లాడుతూ చెరువు సర్వే కొనసాగుతుందని, పూర్తి నివేదిక కోసమే తాము వచ్చామన్నారు. చెరువు సర్వేలో భాగంగా చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ భూములను కూడా వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నామని, శనివారం కూడా సర్వే కొనసాగుతుందని ఆయన తెలిపారు.

కోటపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు

కోటపల్లి, సెప్టెంబర్ 27 : కోటపల్లి మోడల్ స్కూల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకోవాలలని సూచించారు. విద్యార్థులకు న్యాయస్థానాలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాము, ఏఎస్ఐ కాంతారావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మెప్పుకోసమే కాకా పేరు'

బెల్లంపల్లి, సెప్టెంబర్ 27 : ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ మెప్పు పొందేందుకే బెల్లంపల్లి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనానికి కాకా వెంకటస్వామి పేరును మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెరమీదకు తీసుకువస్తున్నారని వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ ఆరోపించారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకా వెంకటస్వామి, ఆయన కుటుంబ సభ్యులు మార్కెట్ భవనానికి ఏం చేశారని నామకరణం చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భిక్షతో చైర్‌పర్సన్‌గా ఎన్నికైన శ్వేత.. ప్రభుత్వం మారిన రెండు రోజులకే కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యేల మన్ననలు పొందేందుకే నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రైవేటు దవాఖానల ఆకస్మిక తనిఖీ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 27 : పట్టణంలోని ప్రైవేట్ దవాఖానలు, నర్సింగ్ హోం, మెడికల్ ల్యాబ్‌లను శుక్రవారం జిల్లా వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బజార్ ఏరియా, కాల్‌టెక్స్, మార్కెట్ ఏరియాల్లోని దవాఖానలను పరిశీలించారు. వైద్యం తీరును దగ్గరుండి పర్యవేక్షించారు. దవాఖానల్లో అందుతున్న చికిత్స వివరాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలు, ల్యాబ్‌లు రెన్యువల్ చేసుకున్నారా లేదా అని ఆరా తీశారు. ఫార్మాసీ విభాగాలను విస్తృతంగా తనిఖీ చేశారు. వైద్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ద వాఖానల నిర్వహణ చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ తెలిపారు.

ముగిసిన డీఐఈవో విచారణ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 27 : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కళాశాల, వసతి గృహంలో డీఐఈవో అంజయ్య విచారణ రెండోరోజు శుక్రవారం ముగిసింది. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న బీసీ బాలికల వసతిగృహానికి ప్రిన్సిపాల్ స్వరూప వెళ్లి విద్యార్థినులను అసభ్యకరంగా దూషించిందని విద్యార్థినులు, విద్యార్థి సంఘం నాయకులు డీఈఐవో అంజయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన రెండు రోజులుగా విచారణ చేపట్టారు. మొదటి రోజు గురువారం బాలికల, బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినులతో వేర్వేరుగా మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. మరుసటి రోజు ప్రిన్సిపాల్ స్వరూప, ప్రతీ లెక్చరర్‌తో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని ఆయన వెల్లడించారు. తదుపరి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

కాసిపేట : ఎంఈవో వెంకటేశ్వర స్వామిని సన్మానిస్తున్న హెచ్ఎంలు, సిబ్బంది

తాండూర్, సెప్టెంబర్ 27 : తాండూర్ ఎంఈవోగా ఎస్ మల్లేశం శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వాసాల ప్రభాకర్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతగూడ పాఠశాలకు, కాగజ్‌నగర్ ఎంఈవోగా వెళ్లారు. తంగళ్లపల్లి హెచ్ఎం, మండల నోడల్ ఆఫీసర్ మల్లేశం ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

కాసిపేట ఎంఈవోగా వెంకటేశ్వర స్వామి..

కాసిపేట, సెప్టెంబర్ 27 : కాసిపేట ఎంఈవోగా ముక్తవరపు వెంకటేశ్వర స్వామి.. మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. కన్నెపల్లి ఎంఈవో సెడ్మాక రాము ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ మేరకు కాసిపేట కాంప్లెక్స్ హెచ్ఎం మామిడిపెల్లి సాంబమూర్తి, దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం రాథోడ్ రమేశ్, ధర్మరావుపేట కాంప్లెక్స్ హెచ్ఎం సుధాకర్ నాయక్, ఎంఆర్సీ సిబ్బంది సీసీవో రాంబాబు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సౌజన్య, సీఆర్పీ మడావి తిరుపతి శుభాకాంక్షలు తెలిపారు.

కన్నెపల్లి, సెప్టెంబర్ 27 : కన్నెపల్లి ఎంఈవో గా రాము బాధ్యతలు స్వీకరించారు. జన్కాపూర్ పీజీహెచ్ఎంగా పనిచేస్తున్న రాము మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు.

దహెగాం, సెప్టెంబర్ 27 : దహెగాం ఎంఈవోగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న భిక్షపతి బదిలీపై హనుమకొండ జిల్లా కొంవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎంగా ఉన్న శ్రీనివాస్‌కు ఎఫ్ఏసీ ఎంఈవోగా ప్రభుత్వం నియమించడంతో ఈయన బాధ్యతలు చేపట్టారు.

వేమనపల్లి, సెప్టెంబర్ 27 : వేమనపల్లి ఎంఈవోగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తిరుపతిరెడ్డి బదిలీపై ఉట్నూర్ వెళ్లారు.

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 27 : కాగజ్‌నగర్ ఎంఈవోగా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన గడ్డం భిక్షపతి హనుమకొండ ఎంఈవోగా బదిలీపై వెళ్లారు. చింతగూడ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు.

జైనూర్, సెప్టెంబర్ 27 : జైనూర్ ఎంఈవోగా జాదవ్ మధూకర్ బాధ్యతలు స్వీకరించారు. ఎఫ్ఏస్ఈగా, మండల పరిషత్ సెకండరీ పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహించిన మధూకర్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.



శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న జీఎం



బెజ్జూర్ : కొండా లక్ష్మణ్ బాపూజీ కి నివాళులర్పిస్తున్న నాయకులు

పోరాట యోధుడు లక్ష్మణ్ బాపూజీ

- ఘనంగా జయంతి వేడుకలు

స్వాతంత్ర్య పోరాట యోధుడు, తెలంగాణ కోసం పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని పలువురు నేతలు, అధికారులు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవిత కాలం పోరాడిన ఆయన.. నేటితరం రాజకీయాలకు, యువతకు ఆదర్శప్రాయమని వివరించారు. ఆయన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పోరాట వీరుడు, కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. **- నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 27**

గూడెంలో పట్టపగలు చోరి

దండేపల్లి, సెప్టెంబర్ 27 : దండేపల్లి మండలం గూడెం గ్రామంలో శుక్రవారం పట్టపగలే దొంగలు చోరికి పాల్పడ్డారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ సమీపంలో గల రోడ్డు పక్కన ఉంటున్న చుంచు సురేశ్ దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి, పనులకు వెళ్లారు. దొంగలు ఇంటి వెనుక తలుపు తాళం పగులగొట్టి చోరికి పాల్పడ్డారు. మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. సీఐ, ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 27 : వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాకథాన్ ర్యాలీ ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, వివిధ సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమ, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్టీయూ నాయకులు

జిల్లా పీఆర్టీయూ నూతన కార్యవర్గం కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస రావు, సునార్కర్ అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు యాదగిరి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు అనురాధ బాయి, నాయకులు రవి, ప్రధానోపాధ్యాయులు సునీత, శ్రీనివాస్, మహేశ్, చంద్రశేఖర్, రాహుల్, శ్రీశైలం పాల్గొన్నారు.

చెప్పేదొకటి.. జరిగేదొకటి!

- ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రకటనకు కాంగ్రెస్ నాయకుల తీరుకు పొంతనే లేదు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 27 : 'రౌడీయిజం... గూండాయిజం... అని నా మీద నిందలేసుడు కొందరికి అలవాటైపోయింది. కాకపోతే నాకంటూ ఎవరూ శత్రువులు లేరు. మంచిర్యాలలో రౌడీయిజం, గూండాయిజం లేకుండా చేస్తా. ప్రశాంతమైన మంచిర్యాల కావలన్నదే నా కోరిక' అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆంతర్యమేమిటో ఆ పార్టీ లీడర్లకే అర్థంకానట్టుంది. ప్రతిపక్ష నాయకులను విమర్శించే క్రమంలో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో పట్టణ నాయకులు మాట్లాడుతూ 'మా ఎమ్మెల్యేపై వేలు చూపిస్తూ మాట్లాడితే ఆ వేలును తీసేస్తాం ఖరర్దార్ బిడ్డా' అని హెచ్చరించారు. ఏదో ఆవేశంలో ఎమ్మెల్యే మీద ఉన్న అభిమానంతో మాట్లాడారనుకుంటే శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మీరు రామబాణాలైతే మేము తలుచుకుంటే మానవ బాంబులమై బ్లాస్ట్ చేస్తామని బీజేపీ నాయకులను హెచ్చరించారు. ఎమ్మెల్యే మాటలకు మొదట కాంగ్రెస్ నాయకులే కట్టుబడినట్లు కనిపిస్తలేదు. ఇలా క్షేత్రస్థాయిలో విమర్శలు చేస్తే ఎమ్మెల్యే పీఎస్సార్‌కు బ్యాడ్ నేమ్ వస్తుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నేతలపై విమర్శలు మానుకోవాలి...

బీజేపీ నేతలు మా ఎమ్మెల్యే పై, కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడం మానుకోవాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, 23వ వార్డు కౌన్సిలర్ రామగిరి బాణేశ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నేత సీనియర్ నాయకుడు రాకేశ్ సీనియర్ నాయకుడైన చిట్ల సత్యనారాయణపై విషం చిమ్మడం సరికాదన్నారు. ఇకపై ఎవరిమీదనైన ఆరోపణలు చేస్తే ముందు నీ స్థాయి ఏమిటో చూసుకొని మాట్లాడాలని సూచించారు.

కుట్టుమిషిన్ల పేరిట కుచ్చుటోపి

నెన్నెల, సెప్టెంబర్ 27 : మధర్ ప్రతిభా ఫౌండేషన్ పేరిట నోముల సాంబశివరామ్.. అమాయక మహిళలను నమ్మించి, కుట్టు మిషిన్లు సబ్సిడీపై ఇప్పిస్తానని చెప్పి వేలాది రూపాయలతో ఉడాయించాడని పలువురు మహిళలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మధర్ ప్రతిభా ఫౌండేషన్ పేరిట నోముల సాంబశివరామ్ గ్రామాల్లో మహిళలకు కుట్టు శిక్షణ, అల్లికలు, మగ్గం వర్క్ నేర్పిస్తామని, అనంతరం సబ్సిడీపై కుట్టు మిషిన్లు ఇప్పిస్తానని చెప్పడంతో వందలాది మంది ఆ సంస్థలో చేరేందుకు సిద్ధమయ్యారు. మన్నెగూడెంలో శిక్షణ కూడా ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో చాలా మంది మహిళలు శిక్షణ కోసం రూ.1150, మిషిన్ కోసం రూ.4,500, ఫిటింగ్ కోసం రూ.900 చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. రెండు నెలలుగా శిక్షణ, మిషన్లు ఇవ్వలేదు. ఫోన్ చేస్తే రేపు, మాపు అంటూ కాలం గడుపుతూ వస్తున్నాడు. ఇటీవల ఎమ్మెల్యే గడ్డం వినోద్ నెన్నెలకు రాగా, అందరికీ నమ్మకం కల్గించేందుకు కొన్ని మిషిన్లు తీసుకువచ్చి, ఆయనతో పంపిణీ చేశారు. అప్పటి నుంచి ఫోన్‌చేస్తే తీయడం లేదని మహిళలు తెలిపారు. దాదాపు రూ.4 లక్షల వరకు చెల్లించినట్లు కుష్నపల్లి మహిళలు తెలిపారు.

రాతికుంట చెరువు పరిరక్షణకు కృషి

బెల్లంపల్లి, సెప్టెంబర్27 : మున్సిపాలిటీ పరిధి అంబేద్కర్ రడగంబాల బస్తీ రాతి కుంట చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నీటి పారుదల శాఖ అధికారి ప్రణీత్ తెలిపారు. శుక్రవారం జేసీబీ సాయంతో చెరువు హద్దులను గుర్తించారు. చెరువు శిఖం భూమి కబ్జాకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిఖం భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు, నీటి పారుదల శాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ అధికారుల పాలం బాట

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 27 : విద్యుత్ అధికారులు శుక్రవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. సారంగపల్లిలో విద్యుత్ శాఖ ఏడీఈ రాజశేఖర్‌తో పాటు అధికారులు పర్యటించారు. విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఈ జయకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, లైన్‌మన్ శంకర్, రవీందర్, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

పొగను నివారించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 27 : పట్టణంలోని పేపర్ మిల్లు నుంచి వెలువడుతున్న కాలుష్య పొగను నివారించాలని కోరుతూ శుక్రవారం కాలనీవాసులు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతిపత్రం అందించారు. మిల్లు కాలుష్య పొగతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. మిల్లు ప్రతినిధులకు గతంలో విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. కాలనీవాసులు ఖయ్యూం, మజీద్ తేజ, సమీర్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ కార్యక్రమాలు

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 27 : చెన్నూర్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కోర్టు ఆవరణలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాంబాబు, కార్తిక్, మహేశ్, మల్లేశం గౌడ్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, సెప్టెంబర్ 27 : మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో దత్తారావు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ తీసారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీవో పూర్ణిమ, ఏపీఎం ముక్తేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, సెప్టెంబర్ 27 : మండలంలోని జాంగావ్ హనుమాన్ ఆలయం ఘాట్ వద్ద అటవీ శాఖ అధికారులు ప్లాస్టిక్, మందు సీసాలను తీసి శుభ్రం చేశారు. అటవీ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొనాన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ సతీశ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని టీఆర్ నగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా, షేక్ జావిద్, కడారి శ్రీధర్, జంబోజు మహేశ్, పూసల అరుణ్ చారి, అరిగెల రవి, చిలుకూరి మహేశ్, సిరికొండ కృష్ణమూర్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.14,190 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

జైపూర్, సెప్టెంబర్ 27 : ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పెగడపల్లి గ్రామానికి చెందిన మాస్ బాల కృష్ణ (35) తనను విధులోలకి తీసుకోవడంలేదని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకృష్ణ మూడు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడతూ విధులకు హాజరుకాలేదు. ఆరోగ్యం కుదుటపడడంతో విధులకు తీసుకోవాలని పదిహేను రోజుల నుంచి ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (హెచ్ఆర్) మధు చుట్టూ తిరుగుతున్నాడు. విధుల్లోకి తీసుకోకపోగా, సూటిపోటి మాటలతో అవమానపరిచాడు. కలత చెందిన బాలకృష్ణ గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు దర్యాపు చేస్తున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాసిపేట, సెప్టెంబర్ 27 : కాసిపేట మండలంలోని మారుమూల ఆదివాసీ గిరిజన పాత తిరుమలాపూర్, పాత తిరుమలాపూర్ గ్రామాల్లోని మూడు గూడేల్లో గల 50 ఆదివాసీ కుటుంబాలకు దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు లయన్స్ క్లబ్ ప్రతినిధి గొంది వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి గొంది వెంకటరమణ, సభ్యులు బొల్లు వెంకటరమణ, మడావి వెంకటేశ్వర్, ప్రసాద్, ఆదివాసీ నాయకులు పెంద్రం హన్మంతు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 27 : యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ సూచించారు. సీసీసీలో శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ర్యాలీ తీశారు. సీసీసీ టౌన్‌షిప్ నుంచి సీసీ కార్నర్, గోదావరికాలనీ షిర్కె, నాగార్జునకాలనీ మీదుగా కొనసాగింది. విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

జైపూర్, సెప్టెంబర్ 27 : ప్రాథమిక విద్యారంగానికి విఘాతం కలిగించే జీవో నంబర్ 55ను సవరించాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. శుక్రవారం జరిగిన మండలస్థాయి సముదాయాల సమావేశంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెకండరీ గ్రేడ్ మంచిర్యాల జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల రాజేందర్‌రెడ్డి, వివిధ సంఘాల బాధ్యులు పత్తిపాక రాజన్న, తోట తిరుమలేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 27 : చెన్నూర్ మండలంలోని ఆస్నాద్, ఓత్కులపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్లకు పలు సూచనలు అందించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఎరువుల అమ్మకాలు పీవోఎస్ మిషన్ ద్వారానే జరుగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మార్కు గ్లాడ్ స్టన్, ఏఈవోలు వనదేవి, సాగర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి

వాంకిడి, సెప్టెంబర్ 27 : నేషనల్ అచీవ్‌మెట్ సర్వే, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. వాంకిడి కేజీబీవీని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే డిసెంబర్ 4వ తేదీన 3, 6, 9వ తరగతులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు విద్యార్థుల్లో కనీస అభ్యాసనా సామర్థ్యాలు మెరుగుపడేలా మరింత సాధన చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండలంలోని పీఆర్ రోడ్డు కల్వర్టు డ్యామేజ్‌ను పరిశీలించారు. పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి శివ చరణ్, పంచాయతీరాజ్ డీఈ, డివిజనల్ పంచాయతీ అధికారి, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి బైండోవర్

నెన్నెల, సెప్టెంబర్ 27 : నెన్నెల సమీపంలోని చెరువు వద్ద గంజాయి కోసం వచ్చి, పట్టుబడిన ఆరుగురిని శుక్రవారం తహసీల్దార్ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చి, పోలీసులను చూసి పారిపోతుండగా, పట్టుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తితో పతకాలు సాధించాలి

రెబ్బెన, సెప్టెంబర్ 27 : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి, పతకాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు సూచించారు. బెల్లంప